సాక్షి నారాయణపేట

బుధవారం, 1, మార్చి, 2023



ఫాస్టాగ్‌తో పట్టుబడ్డారు

వాహనం ఫాస్టాగ్ ఆధారంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు.

వివరాలు 8లో ▸



బీఎస్పీతోనే రాజ్యాధికారం

బీఎస్పీతోనే బడుగులకు రాజ్యాధికారం దక్కుతుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.5 /19.4

రోజంతా ఆకాశం నిర్మలంగా, ఎండగా ఉంటుంది. రాత్రికి చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కంటి పరీక్షలు చేయించుకోండి

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి సూచించారు. మంగళవారం మండలంలోని నాగంపల్లిలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంత మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంత మందికి అద్దాలు అందజేశారని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.

ఆధార్ సీడింగ్ తప్పనిసరి

దామరగిద్ద: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీ ఆధార్ సీడింగ్, బ్యాంక్ ఖాతాకు ఈకేవైసీ చేయించుకుని ఉండాలని డీఆర్‌డీఓ పీడీ గోపాల్ నాయక్ చెప్పారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం వత్తుగుండ్ల, చాకల్‌వానిపల్లిలో పాంపండ్ పనులను, నర్సరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి గ్రామంలో వంద మందికి తగ్గకుండా పని కల్పించాలన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టీఏలు కూలీల మస్టర్‌లను సకాలంలో రికార్డు చేసి నిధులు రాగానే పేఆర్డర్‌ల ద్వారా డబ్బులు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంపీఈఓ రామన్న, ఇన్‌చార్జ్ ఏపీఓ రవికుమార్, టీఏ ఉన్నారు.

జొన్నపంట పరిశీలన

దామరగిద్ద: మండలంలోని గడిమున్కన్‌పల్లిలో సాగు చేసిన సీబీ–33 అనే హైబ్రిడ్ రకానికి చెందిన జొన్న పంటను మంగళవారం ఇంటర్‌నేషనల్ మిల్లెట్ రీసర్చ్ హైదరాబాద్, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శేఖర్‌బట్, కులకర్ణి బృందం పరిశీలించింది. రైతు రాధమ్మ, పార్వతమ్మను అడిగి పంట సాగులో తీసుకున్న మెళకువలను తెలుసుకున్నారు. కంకిపట్టే దశలో ఉండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ పంటను మండలంలోని గడిమున్కన్‌పల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసినట్లు ఏఈఓ అరవింద్ తెలిపారు.

చైల్డ్ హోంలో బాలిక ఆత్మహత్యా యత్నం

నారాయణపేట రూరల్: కౌన్సెలింగ్ కోసం వచ్చిన ఓ బాలిక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూర్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12) పట్టణంలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కొద్దికాలంగా అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇరువురు ప్రేమించుకుంటున్నట్లు అమ్మాయి ఇంట్లో తెలియడంతో తండ్రి తీవ్రంగా మందలించాడు. వెంటనే పేరెంట్స్ కౌన్సెలింగ్ నిమిత్తం సీడబ్ల్యూసీని ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా చైల్డ్ హోంలో ఉంచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే మంగళవారం ఉదయం కడుపునొప్పి రావడంతో తట్టుకోలేకపోయింది. కాలకృత్యాలకు వెళ్లి వచ్చి తన చున్నీతో గొంతుకు బిగించుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన సిబ్బంది వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. ముక్కులో నుంచి రక్తం రావడం, గొంతు దగ్గర ఇబ్బందికరంగా చారలు కనిపించడంతో వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఈఎన్‌టీ డాక్టర్ పరిశీలనకు రెఫర్ చేశారు. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఊట్కూర్ ఎస్ఐ రాములును సంప్రదించగా ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. సంబంధిత అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు.

తూకంలో మోసంపై ఆగ్రహం

కాటన్‌మిల్లుకు తాళం వేసిన పత్తి రైతులు



కాటన్‌మిల్లులో నిర్వాహకులను నిలదీస్తున్న రైతులు (ఫైల్)

- దోచుకుంటున్నారంటూ మిల్లు నిర్వాహకులతో గొడవ
- నిలువు దోపిడీకి గురవుతున్నామంటున్న రైతులు

నారాయణపేట/దామరగిద్ద: తూకంలో మోసంపై పత్తిరైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం చేసిన కష్టాన్ని నిలువుదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని దామరగిద్ద మండలం ఉల్లిగుండం దగ్గర కాటన్‌మిల్లులో పత్తి తూకంలో మోసంపై పలువురు రైతులు ఆందోళనకు దిగారు. పత్తి మిల్లులోని వే బ్రిడ్జిపై ఇది జరుగుతోందని, రైతులకు అర్థమవుతున్నా, మార్కెట్ అధికారులకు ఎందుకు పట్టడంలేదని ప్రశ్నిస్తున్నారు. రైతులే సమాచారం ఇచ్చినా పెద్దగా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బేరసారాలెందుకో?..

రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి తూకంలో మోసం లేదంటున్న కాటన్ మిల్లు నిర్వాహకులు బేరసారాలు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పత్తి మిల్లు యజమానులు పిలిపించుకొని నిర్వాహకుల



ఆందోళనకు దిగిన రైతులు (ఫైల్)

పొరపాటు వల్ల తూకంలో తేడా కనబడిందనే విషయాన్ని పెద్దది చేయొద్దంటూ రైతులను సముదాయించారు. పత్తి డబ్బులతో పాటు అదనంగా రూ.20వేలు ఇచ్చి పంపించడం ఏమిటని రైతులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

అలా వెళ్లారు.. ఇలా వచ్చారు

కాటన్‌మిల్‌లో తూకంలో మోసాలు జరిగాయంటూ సోషల్ మీడియాలో విషయం వైరల్ కావడంతో వెంటనే మార్కెట్ అధికారులు, సిబ్బంది గణేశ్‌కాటన్ మిల్లుకు చేరుకున్నారు. అధికారులు అక్కడికి వెళ్లే లోపే కాటన్ మిల్ నిర్వాహకులు తూనికలను చక్కదిద్దుకున్నారు. వే బ్రిడ్జి తూకాలను పరిశీలించి చేసేదేమీ లేక తిరిగి వచ్చారు. అయితే అ అధికారులు అక్కడికి చేరేలోపే మార్కెట్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి వారికి ఫోన్ చేయడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తూ బయటికి రావడం పలు అనుమానాలకు తావిస్తుంది. రైతులు తమకు ఫిర్యాదు చేయడం లేదనే సాకుతో మార్కెట్ అధికారులు చేతులు దులుపుకొన్నారు.



కాంటాలో మోసం చేశారని చూయిస్తున్న రైతులు

కాటన్‌మిల్లుకు తాళం..

దామరగిద్ద మండలంలోని ఉల్లిగుండం శివారులోని శ్రీ గణేష్ కాటన్ మిల్లులో గత గురువారం కర్నాటక రాష్ట్రం కానగడ్డకు చెందిన రైతులు భీములు, తిమ్మప్పతో పాటు పలువురు రైతులు అదే గ్రామానికి చెందిన రమేష్ బొలెరో వాహనంలో పత్తిని తీసుకెళ్లారు. బొలెరో వాహనంతో సహా కాటన్‌మిల్లులోని వే బ్రిడ్జిపై తూకం చేయగా 36 క్వింటాళ్లు వచ్చింది. రైతులకు అనుమానం రావడంతో మళ్లీతూకం చేయించారు. రెండోసారి 48 క్వింటాళ్లు వచ్చింది. దాదాపు 12 క్వింటాళ్లు పత్తి తూకం ఎక్కువ రావడంతో రైతులు భీంరెడ్డి, తిమ్మప్ప ఆగ్రహంతో రైస్‌మిల్లు నిర్వాహకులతో గొడవకు దిగారు. ఒకింత కాటన్‌మిల్లుకు తాళం వేశారు. ఒక్కో రైతు నుంచి క్వింటాళ్ల కొద్ది పత్తిని మోసం చేస్తున్న మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీంతో నిర్వాహకులు రైతుల వద్దకు చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రైతులకు మళ్లీ తూకం చేస్తామనడంతో తాళం తీసినట్లు రైతులు తెలిపారు.

రూ.20 వేలు ఇచ్చింది నిజమే..

పత్తి వాహనం తూకం చేయగా తక్కువ రావడంతో తేడాను గమనించి అనుమానంతో మళ్లీ వే బ్రిడ్జి పైకి ఎక్కించి తూకం చేయించాం. 12 క్వింటాళ్ల తేడా వచ్చింది. రైతులు గొడవకు దిగడంతో వారికి రూ.20వేలు ఇచ్చి పంపించాడు. తూకంలో తేడా వచ్చిన విషయం వాస్తవమే. కాటన్ మిల్లు నిర్వాహకులు పొరపాటు జరిగిందని ఒప్పుకున్నారు.

– రమేష్, బొలెరో వాహనం డ్రైవర్

తూకంలో మోసం లేదు..

వే బ్రిడ్జిపై వాహనం సరిగా నిలిచి ఉండకపోవడం, ముందు వాహనం వెళ్లిన తర్వాత జీరో కాకముందే వాహనం వే బ్రిడ్జి పైకి ఎక్కించడం వల్ల జరిగి ఉంటుంది. మళ్లీ తూకం చేయగా సరిగ్గా వచ్చింది. గతంలో సదరు రైతుకు పత్తి ధర తక్కువగా వచ్చిందనే అక్కసుతోనే తూకంలో తేడా వచ్చిందంటూ ప్రచారం చేస్తున్నారు.

– సురేష్, మిల్లు నిర్వాహకుడు

ఫిర్యాదు చేస్తే చర్యలు..



కాటన్ మిల్లులో జరుగుతున్న మోసాలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. మోసం జరిగిందంటున్న రైతులు తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. తూకంలో తేడాపై సామాజిక మాధ్యమాల్లో రావడంతో తమ సూపర్‌వైజర్ సిబ్బందిని పంపించి పర్యవేక్షించాం. తూకాన్ని పరిశీలించి ఎలాంటి తేడా కనిపించలేదు.

– చంద్రశేఖర్, మార్కెట్ కార్యదర్శి, నారాయణపేట

ఉపాధి కూలీల సంఖ్యలో వ్యత్యాసం

అదనపు కలెక్టర్ సీరియస్

నర్వ: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనికి వచ్చిన కూలీలకు, రికార్డులో నమోదుకు వ్యత్యాసం ఉండటంతో ఉపాధి సిబ్బందిపై అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ సీరియస్ అయ్యారు. మంగళవారం ఉదయం ఆకస్మికంగా నర్వ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఏపీఓ మొగిలయ్యను నర్వ, లంకాల్ గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, నర్సరీలకు వినియోగించే కూలీల వివరాలు, మస్టర్‌లలో నమోదు చేసిన కూలీల సంఖ్యను ఆయన ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను వేసవిలో పెంచాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అడిషనల్ కలెక్టర్‌ను నర్వ పంచాయతీ సిబ్బంది కలిశారు. తమక మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని వాపోయారు. పరిశీలించి అందేలా చూస్తానని



ఉపాధి సిబ్బందితో పనుల వివరాలు ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

చెప్పారు. అనంతరం లంకాల్ గ్రామ వన నర్సరీని పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండి పోకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం లంకాల్ మండల పరిషత్ పాఠశాలలో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను పర్యవేక్షించారు. గడువు లోపల పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈ మారెప్పకు సూచించారు. గ్రామ పంచాయతీని తనిఖీ చేసి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంబడి ఎంపీడీఓ రమేష్‌కుమార్, పీఆర్ ఏఈ మారెప్ప, ఏపీఓ మొగిలప్ప, ఉపాధి సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు గణితం భయం పోగొట్టాలి



జిల్లాలోని వసతిగృహ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- ఒక్క విద్యార్థి కూడా సీ, డీ గ్రేడ్‌లో ఉండొద్దు
- ప్రత్యేక కార్యాచరణ అమలుచేయాలి
- హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నారాయణపేట: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పదో తరగతి గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గణితంలో ఎంతమంది 10జీపీఏ సాధించనున్నారు. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి ఎలాంటి పాఠ్యప్రణాళిక చేస్తున్నారనేదానిపై ఒక్కో పాఠశాల వారీగా సమీక్ష నిర్వహించారు. పరీక్షలకు 40 రోజులే మిగిలాయన్నారు. ప్రత్యేక తరగతులు, ప్రత్యేక కార్యాచరణతో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకెళ్లాలని చెప్పారు. విద్యార్థులు ఒక్కరు కూడా సీ, డీ గ్రేడ్‌లో ఉండటానికి వీలు లేదన్నారు. సమావేశంలో డీఈఓ లియాఖత్‌అలీ, పద్మనళిని, రాజేశ్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా చూసుకోవాలి

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష హాస్టళ్ల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూచించారు. హాస్టళ్లలో వసతులపై నివేదిక ఇవ్వాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి క్రిష్ణమచారి, డీఎస్‌డీఓ కన్యకుమారి, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మరికల్: విద్యార్థులు సొంత నైపుణ్యంతో ప్రయోగాలు తయారుచేసి భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ లియాకత్ అలీ అన్నారు. మండలంలోని తీలేర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. వాటి ఉపయోగాలు తెలుసుకుని అభినందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రేవతమ్మ, హెచ్ఎం అనురాధ, రాజు, సికిందర్ పాల్గొన్నారు.

వినూత్న పద్ధతిలో..

మరికల్ శ్రీవాణి పాఠశాల విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని వినూత్న పద్ధతిలో జరుపుకున్నారు. సైన్స్‌ను ఆధారంగా చేసుకొని పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లకు సైన్స్ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. పండ్లు పంపిణీ చేశారు.



తీలేర్‌లో ప్రయోగం గురించి వివరిస్తున్న విద్యార్థినులు

వాణిజ్య వాహనాల పన్ను చెల్లించాలి

- మద్దూరులో 4 వాహనాలను సీజ్ చేసిన ఆర్‌టీఓ
- అగ్రికల్చర్ ట్రాక్టర్లను కమర్షియల్ రవాణాకు వాడొద్దు

మద్దూరు: కమర్షియల్ వాహనాలు మూడు నెలలకోసారి టాక్స్ చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి రామస్వామి సూచించారు. మంగళవారం మద్దూరు, కొత్తపల్లి మండలాలో పలు వాహనాలను తనిఖీ చేశారు. నాలుగు వాహనాలపై కేసు నమోదు చేసి, సీజ్ చేశారు. అందులో మూడు వాహనాలు టాక్స్ కట్టనివి కాగా, ఒక వాహనం ఫిట్‌నెస్ లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ట్రాక్టర్ ట్రాలీలు 1,587, గూడ్స్ 1,075, మాక్సి క్యాబ్‌లు 21, ఇతర వాహనాలు 453 కమర్షియల్‌గా ఉండి పన్ను కట్టాల్సి ఉంది. ఈ 3,136 వాహనాలు టాక్స్, అపరాధ రుసుము కలిపి దాదాపు రూ.2కోట్లు రవాణశాఖకు రావాల్సి ఉందన్నారు. వాహనదారులు సకాలంలో త్రైమాసిక టాక్స్ చెల్లించి అపరాధ రుసుము నుంచి మినహాయింపు పొందాలన్నారు. ఒకవేళ మా తనిఖీల్లో పట్టుబడితే వాహనం సీజ్ చేసి 50శాతం నుంచి 200శాతం వరకు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే మద్దూరు మండలంలో అగ్రికల్చర్ ట్రాక్టర్స్ ఇసుకను తరలిస్తున్నాయి. ఈ ట్రాక్టర్లు కమర్షియల్ పనుల కోసం వాడితే వాటిని సీజ్ చేస్తామన్నారు. జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్రికల్చర్ ట్రాక్టర్లను కమర్షియల్ రవాణాకు వాడుకోవద్దని సూచించారు.

వేరుశనగ క్వింటా రూ.7,440

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగ ధర గరిష్టంగా రూ.7,440, కనిష్టంగా రూ.3,600 పలికింది. శనగలు గరిష్టంగా రూ.4,797, కనిష్టంగా రూ.4,755, ఎర్రకందులు గరిష్టంగా రూ.8,259, కనిష్టంగా రూ.7,559, పెసర రూ.7,209, జొన్నలు గరిష్టంగా రూ.4,427, కనిష్టంగా రూ.2021, కుసుమలు గరిష్టంగా రూ.4,463, కనిష్టంగా రూ.4,419, అలసందలు గరిష్టంగా రూ.6,206, కనిష్టంగా రూ.3,500 పలికింది. పత్తి క్వింటా గరిష్టంగా రూ.7600, కనిష్టంగా రూ.4500 పలికింది.

కాలగర్భంలోకి అరుదైన భవనం

- కనుమరుగైన నిజాం కాలంనాటి పాత కలెక్టరేట్
- 86 ఏళ్ల పాటు పాలనాపరమైన సేవలు
- ఉమ్మడి జిల్లాలో అరుదైన కట్టడాల్లో ఒకటిగా గుర్తింపు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రజలకు ఎన్నో సేవలందించిన పాత కలెక్టరేట్ కనుమరుగైంది. నిజాం కాలం నాటి కట్టడానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ భవనం కాలగర్భంలో కలిసిపోయింది. నిజాంల రాజసం ఉట్టిపడేలా పరిపాలనకు అనువుగా ఉన్న ఈ భవనం ఇక చరిత్రగా మారిపోయింది. ఉమ్మడి జిల్లాలో అరుదైన కట్టడాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ భవనం అధికార పాలన కేంద్రంగా ఎనిమిదిన్నర దశాబ్దాల పాటు వెలుగొందింది. జిల్లాకేంద్రం శివారులోని పాలకొండ సమీపంలో నూతన సమీకృత భవనం నిర్మించడంతో కలెక్టరేట్ సహా ఇతర అన్ని కార్యాలయాలు అక్కడికి తరలివెళ్లాయి. ఈ క్రమంలో పురాతన భవనాన్ని కూలివేసి ఈ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నారు.

1883లో అంకురార్పణ..

ఆరో నిజాం ప్రభువు మీర్ మహబూబ్ అలీఖాన్ ఈ ప్రాంత పరిశీలనకు వచ్చినప్పుడు జిల్లాకేంద్రం ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, వాటికి తోడు రైలు మార్గం సైతం ఉండటంతో పాలన వ్యాపారాలకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని భావించి జిల్లా కేంద్రంగా 1883లో అంకురార్పణ చేశారు. అప్పటి వరకు జిల్లా కేంద్రంగా ఉన్న నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్‌కు మార్చారు. మొదట్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను స్థాపించారు. ముఖ్యమైన ప్రభుత్వ వ్యవస్థ అంతా ఒకేచోట ఉండే విధంగా కలెక్టరేట్ భవనాన్ని 1936లో ప్రారంభించారు. అప్పుడు ఇక్కడి నుంచి రెవెన్యూ, సాగునీరు, ఎక్సైజ్‌తో పాటు ఇతర 12 శాఖలకు చెందిన అధికారులు ఈ భవనం నుంచే కార్యకలాపాలు నిర్వహించేవారు. ఈ కారణంగానే ఈ భవనాన్ని భారకచేరి అని పిలిచేవారు.

39 మంది కలెక్టర్లు

ఈ భవనం నుంచి 39 మంది కలెక్టర్లు తమ పరిపాలన సాగించారు. 1960లో జిల్లా మొదటి కలెక్టర్‌గా శంకర్‌స్వామి ఏడాదిపాటు పనిచేశారు. ఆ తర్వాత ఖాజామహబూబ్ హుస్సేన్, దస్తగిరిఖాద్రి, బీఎల్ ఓటస్, అచంట, హస్నొద్దీన్ అహ్మద్, వీకే దార్, అతదుల్లాసయ్యద్, నాగరత్నం, సయ్యద్ హైదర్‌రాజా, కసిపాయదియాన్, ఆనందరావు, గోపాల్‌రావు, మజారొద్దీన్, నారాయణరావు, పంకజ్ ద్వివేది, మురళీధర్, బంగర్, భట్టాచార్య, శామ్యూల్, విస్వల్, సుబ్రమణ్యం, రెడ్డయ్య, ప్రీతిసుదన్, రైమండ్‌పీటర్, కృష్ణయ్య, రాము, మధుసూదన్‌రావు, జగదీశ్వర్, ఉషారాణి, దమయంతి, పురుషోత్తంరెడ్డి, ఇన్‌చార్జ్‌గా శర్మన్, గిరిజాశంకర్, ప్రియదర్శిని, రొనాల్డ్ రోస్, వెంకట్రావ్ ఇక్కడ పనిచేశారు.



మహబూబ్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ భవనం (ఫైల్)



నేలమట్టమైన భవనం

రైతులను డబ్బు అడిగితే చర్యలు



మరమ్మతు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రంలో తనిఖీలు

- బాధిత రైతులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా విచారణ
- 'సాక్షి' కథనం ఆధారంగా లిఖిత పూర్వకంగా వివరణ
- మరమ్మతు కేంద్రంలో రికార్డుల పరిశీలన
- జిల్లా అధికారుల ఫోన్ నంబర్ల చార్ట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- రవాణా చార్జీల చెల్లింపు అమలు చేయాలని ఎస్ఈ ఆదేశాలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కోస్గి: రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న విద్యుత్ శాఖలో సిబ్బంది చేతివాటం, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రంలో రైతులకు రవాణా చార్జీలు చెల్లించకపోవడం, లోడింగ్, అన్‌లోడింగ్ పేరుతో అక్రమ వసూళ్లపై 'సాక్షి'లో సమగ్ర వివరాలతో ఈనెల 27న ప్రచురితమైన 'వసూళ్ల పర్వం' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎం అండ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ శ్రీనివాస్, ఈడీఈ జగదీష్, ఏఈ వెంకటేష్ మంగళవారం కోస్గి మరమ్మతు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అక్కడి సిబ్బంది, సూపర్‌వైజర్, జేఎల్ఎంలతో వేర్వేరుగా మాట్లాడారు. వారందరితో లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. మరమ్మతు కేంద్రంలో వాడుతున్న ఆయిల్, ఇతర సామగ్రిని పరిశీలించారు. నిబంధనల మేరకు రైతులకు అందిస్తున్న సేవలను అడిగి నమోదు చేసుకున్నారు. అనంతరం సాక్షి కథనం ఆధారంగా బాధిత రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇకపై ట్రాన్స్‌కో సిబ్బందిగాని, అధికారులు గాని, మరమ్మతు కేంద్రంలో ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా జిల్లా అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని డీఈ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మరమ్మతు కేంద్రాల వద్ద జిల్లా అధికారుల ఫోన్ నంబర్లతో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడితే కాంట్రాక్ట్ సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలు, విచారణకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించి పూర్తి నివేదికను ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

చార్జీల చెల్లింపు అమలు..

మరమ్మతు కేంద్రానికి సొంత వాహనాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు తీసుకువచ్చే రైతులకు నేటి నుంచి (మార్చి 1 నుంచి) రవాణా చార్జీలు చెల్లించాలని ఎస్ఈ ప్రభాకర్ ఆదేశించినట్లు ఎంఅండ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ శ్రీనివాస్ ప్రకటించారు. రవాణా చార్జీల చెల్లింపు తక్షణమే అమలు చేస్తున్నామని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు అనంతరం బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు అందజేయాలని ఆలస్యం కాకుండా వెంటనే ఆన్‌లైన్ విధానంలో రూ.1000లు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో మంగళవారం ఉదయం బరిగెల సాయమ్మ (37) ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అచ్చంపేట ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయింది. భర్త కృష్ణయ్యతోపాటు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలియడంతో సాయంత్రం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

బావిలో పడి మహిళ మృతి

మల్దకల్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ మంగళవారం బావిలో పడి మృతి చెందిన సంఘటన గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. ఉలిగేపల్లె గ్రామానికి చెందిన మాణిక్యమ్మ (40) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన విషయాన్ని రైతులు గమనించి, కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త గోపాల్, కుమారుడు, కుమార్తెలున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని: మహిళ దుర్మరణం

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం చెందినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అన్నాసాగర్‌కి చెందిన మాధవి(30) హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి 15 ఏళ్ల కిందట వివాహమైంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి అన్నాసాగ్‌కు బస్సులో వస్తుండగా భూత్పూర్‌లోని మునిరంగస్వామి దేవాలయ సమీపంలోని బ్రిడ్జి వద్ద బస్సు దిగింది. నడుచుకుంటూ అన్నాసాగర్‌కు వస్తుండగా.. పోతులమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తల భాగం గుర్తు పట్టకుండా నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న భూత్పూర్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మాధవి తల్లి మన్నెమ్మ జిల్లా ఆస్పత్రిలోని మార్చురిలో ఉన్న మృతదేహం తన కుమార్తెదేనని గుర్తించింది. మన్నెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణపేట రూరల్: ఎల్లమ్మ తల్లి దర్శనానికి వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడ్డారు. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ కథనం ప్రకారం.. దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె ఆనంద్ (20) తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం నారాయణపేట మండలం లింగంపల్లి ఎల్లమ్మ తల్లి జాతరకు ట్రాక్టర్‌లో బయలుదేరాడు. స్వయంగా ట్రాక్టర్ నడుపుతున్న ఆనంద్ మార్గమధ్యంలో కొల్లంపల్లి దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లూనాను తప్పించబోయి ప్రమాదవశాత్తు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ఇంజిన్ వెనక టైరు అతడిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి మామ తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో..


సుధాకర్ (ఫైల్)

నారాయణపేట రూరల్: ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన ఊట్కూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ధన్వాడకి చెందిన ఎర్రగుంట్ల సుధాకర్ (29) జియో ఫైబర్ వర్క్ పనులు చేస్తుంటాడు. మంగళవారం సైతం విధులు ముగించుకుని నారాయణపేట నుంచి ధన్వాడకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో అప్పక్‌పల్లి దాటిన తర్వాత పత్తిమిల్లు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన నిడుగుర్తి శివారు కావడంతో మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు ఇచ్చిన తర్వాత ఊట్కూరు పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి మోసపోయిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ కథనం ప్రకారం.. హమాలీకాలనీ/హట్‌కార్‌పేట్‌కు చెందిన రాఘవేంద్రకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, తన వ్యక్తి గత ఖాతా క్రెడిట్ కార్డు వ్యాలిడిటీ పరిమితి ముగిసిపోయిందని చెప్పారు. తన కార్డు వివరాలు, ఓటీపీ నంబర్లు తెలియజేస్తే.. కార్డు సరిచేస్తామని నమ్మబలికారు. దీంతో వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి తన పూర్తి వివరాలను వారికి తెలియజేశాడు. వెంటనే తన ఖాతాలోని రూ.40 వేల నగదును తస్కరించారు. నగదు డ్రా అయినట్లు సమాచారం రావడంతో సైబర్ క్రైంగా గుర్తించి బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

ఫాస్టాగ్‌తో పట్టుబడ్డారు

- నలుగురిలో ఇద్దరు అరెస్టు, రిమాండ్
- ఆధునిక టెక్నాలజీతో ఏటీఎంలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా
- ఈనెల 10న రాజాపూర్ ఏటీఎంలో చోరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: వాహనం ఫాస్టాగ్ ఆధారంగా అంతర్రాష్ట్ర ఏటీఎం దొంగల ముఠాను మహబూబ్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు. ఈనెల 10న మధ్యాహ్నం రాజాపూర్‌లో ఉన్న టాటా ఇండికాష్ ఏటీఎంలో దొంగతనం జరిగింది. దీనిపై ఈనెల 16న బ్యాంకు సిబ్బంది ఈడిగ రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి విచారణ చేసినట్లు వెల్లడించారు. పంజాబ్‌కు చెందిన భూపేందర్‌సింగ్ బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) పూర్తి చేసి ఏటీఎంలలో నగదు అప్‌లోడ్ చేయడంతో పాటు ఏటీఎం మిషన్లు మరమ్మతు చేస్తూ జీవనం సాగించేవాడు. దాదాపు 14నుంచి 15ఏళ్ల పాటు ఏటీఎం టెక్నీషియన్‌గా పని చేస్తున్న క్రమంలో వాటిద్వారా ఆదాయం తక్కువగా రావడంతో ఏటీఎంలలో సాఫ్ట్‌వేర్ ఉపయోగించి దొంగతనాలు చేయాలని పథకం వేసుకున్నాడు. దీనికి పంజాబ్‌కు చెందిన గుర్‌గగన్ సింగ్, రష్‌పాల్, సందీప్‌సింగ్‌లను కలుపుకుని చోరీ చేయడం మొదలుపెట్టాడు. అయితే ఈ ముఠా సభ్యులు ఓటీపీ వచ్చే విధానం కలిగిన నూతన టెక్నాలజీ ఏటీఎంలు కాకుండా మాన్యువల్‌గా ఉపయోగించే ఏటీఎంలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేసేవారు. వారు ఎంపిక చేసుకున్న ఏటీఎంలలో ప్రైవేట్ ఏజెన్సీ వచ్చి ఏటీఎంలో డబ్బులు పెడుతున్న క్రమంలో అప్పటికే ఈ ముఠా ఏటీఎంలో వైఫై కెమెరా ఏర్పాటు చేసి వాటి ద్వారా నగదు పెట్టే సమయంలో క్యాష్ బాక్స్ పాస్‌వర్డ్ తెలుసుకుంటారు. ఆ తర్వాత అతని మొబైల్‌కు వచ్చే పాస్‌వర్డ్ వీడియో ఉపయోగించి ఏటీఎంను ఏమాత్రం ధ్వంసం చేయకుండా కేవలం పాస్‌వర్డ్‌తో ఓపెన్ చేసి డబ్బులు ఎత్తుకెళ్లడం ఈ ముఠా ప్రత్యేకత. ఈ క్రమంలోనే ఈనెల 10న మధ్యాహ్నం రాజాపూర్‌లో ఉన్న టాటాఇండికాష్ ఏటీఎంలో ప్రైవేట్ ఏజెన్సీ డబ్బులు పెట్టి వెళ్లిన పది నిమిషాల వ్యవధిలో పాస్‌వర్డ్ ఉపయోగించి రూ.7,82,300నగదు చోరీ చేసి మళ్లీ బాక్సులను పాస్‌వర్డ్ ద్వారా మూసివేశారు. అక్కడి నుంచి డబ్బులు తీసుకుని డీఎల్ 1సీ ఏఎఫ్ 7975 ఫార్చునర్ కారులో పరారయ్యారు. ఆ తర్వాత కారు కోసం ఉపయోగించిన ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. ఇదే ముఠా సంగారెడ్డిలో ఏటీఎం నుంచి రూ.30లక్షలు, నల్లగొండ జిల్లాలోని చిట్యాల దగ్గర ఉన్న ఏటీఎం నుంచి రూ.3.4లక్షలు


సీజ్‌చేసిన కారు

నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీంతో పాటు పంజాబ్, రాజస్తాన్, చండీగర్, ఉత్తరాఖండ్‌లో ఏటీఎం దొంగతనాలు చేశారని, 2012లో జైలుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఈ ముఠాలో ఏ1 గుర్ గగన్‌సింగ్, ఏ2 భూపేందర్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దీంట్లో ఏ3 రష్‌పాల్, ఏ4సందీప్ సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.5వేల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్స్ రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ టి.మహేష్, సీఐలు జమ్ములప్ప, ఇఫ్తాకార్ అహ్మద్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు


వాగులో బైఠాయించిన రైతులు

- సీసీ రహదారి నిర్మాణానికి ఇవ్వాల్సిందేనన్న తహసీల్దార్
- వాగులో బైఠాయించి నిరసన


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

గండేడ్: 'వాగులో ఇసుక తరలిస్తే బోరుబావుల్లో నీటిమట్టం పడిపోయి పంటలు ఎండిపోతాయి.. కాళ్లు మొక్కుతాం.. తరలించొద్దు కనికరించండి' అంటూ రైతులు తహసీల్దార్‌ను వేడుకున్న ఘటన మండలంలోని రంగారెడ్డిపల్లి పెద్దవాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రంగారెడ్డిపల్లి పెద్దవాగు వెంట సల్కర్‌పేటకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. వాగులో నీళ్లుంటేనే బోర్లు సక్రమంగా నడిచి పంటలు ఎండిపోకుండా ఉంటాయి. అయితే ఉపాధిహామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాలకు సీసీ రహదారులు మంజూరయ్యాయి. రంగారెడ్డిపల్లి పెద్దవాగు నుంచి ఇసుక తరలించేందుకు సౌకర్యంగా ఉండడంతో తహసీల్దార్ జ్యోతి గతవారంలో ఒకరోజు తరలింపునకు అనుమతి ఇవ్వడంతో ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగింది. సోమవారం కూడా అదే వాగు నుంచి ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వగా రైతులు అడ్డుకున్నారు. మంగళవారం వాగు దగ్గరికి వచ్చిన తహసీల్దార్ మాట్లాడటానికి రావాలంటూ రైతులను పిలిపించారు. ఇసుక తరలిస్తే బోర్లలో నీటిమట్టం తగ్గి నీరందక పంటలు ఎండిపోతాయని.. ఎట్టి పరిస్థితుల్లో తరలింపునకు అనుమతి ఇవ్వవద్దని తహసీల్దార్‌ను వేడుకున్నారు. గతేడాది ఇసుక తరలించడంతో ప్రస్తుతం తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరోజు అధికారికంగా అనుమతి ఇస్తే రాత్రి వరకు తరలిస్తున్నారని వివరించారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సీసీ రహదారుల నిర్మాణం మార్చి నెలలో తప్పనిసరిగా పూర్తి చేయాలని.. ఇసుక మీ సొంతం కాదని పక్కకు తప్పుకోవాలని హెచ్చరించారు. దీనికి ఒప్పుకోమంటూ పదుల సంఖ్యలో రైతులు ట్రాక్టర్లలో ఇసుక నింపే ప్రాంతానికి వెళ్లి బైఠాయించి అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పట్టువీడలేదు. సుమారు రెండుగంటల పాటు ఓ వైపు రైతులు.. మరోవైపు తహసీల్దార్ ఎండలో నిలబడ్డారు. చివరకు రైతులతో మరోమారు తహసీల్దార్ మాట్లాడి పంటలు ఎండకుండా చూస్తామని, ఈ ఒక్కరోజు తరలింపునకు అంగీకరించాలని కోరగా ఆందోళన విరమించారు. ఇకముందు ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వవద్దని రైతులు తహసీల్దార్ జ్యోతికి విన్నవించారు. దీంతో మధ్యాహ్నం నుంచి ఇసుక తరలింపు కొనసాగింది.

పోల్కంపల్లి పెద్దవాగు వద్ద..


నిరసన తెలుపుతున్న రైతులు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతితో అభివృద్ధి పనుల నిమిత్తం రెండురోజులుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. వాగులో తమ పట్టా భూములు ఉన్నాయని మంగళవారం పరిసర రైతులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలాల నుంచి ట్రాక్టర్లు వెళ్లడంతో దెబ్బతింటున్నాయని, కొన్ని ట్రాక్టర్లకే అనుమతి ఉండగా అక్రమంగా మరికొన్ని ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు ఆడింటే ఆటగా సాగుతోందని తెలిపారు. ప్రభుత్వ పనుల పేరుతో ఇసుకను తరలించి విక్రయిస్తున్నారని వివరించారు.

బావిలో మహిళ, చిన్నారి మృతదేహాలు


బావిలో మహిళ, చిన్నారి మృతదేహాలు

వనపర్తి క్రైం: గుర్తుతెలియని ఓ మహిళ, మరో చిన్నారి మృతదేహాలు బావిలో లభ్యమైన ఘటన మంగళవారం ఉదయం మండలంలో వెలుగుచూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. 35 ఏళ్ల ఓ మహిళ, ఆరేళ్ల ఓ చిన్నారి మృతదేహాలు మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న బావిలో కుళ్లిన స్థితిలో ఉండగా.. మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం అటుగా వెళ్లిన కృష్ణయ్య చూసి వెంటనే సర్పంచ్ కొండన్నకు సమాచారం అందించారు. ఆయన వనపర్తి రూరల్ పోలీసులకు తెలియజేయగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్‌రావు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని బావిలో పడి ఉన్న మృతదేహాలను పరిశీలించారు. బావిగడ్డపై ఉన్న సంచిలో నిమ్మకాయలు, విభూతి, మంత్రబొమ్మలు గీసిన ఓ కాగితం లభించాయి. మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో చనిపోయి మూడురోజులు కావచ్చని పోలీసులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

నిమ్మకాయలు, విభూది లభ్యం


ఘటన స్థలం వద్ద లభించిన నిమ్మకాయలు

నిమ్మకాయలు, పేపర్ ఆధారంగా..

బావిగడ్డపై దొరికిన నిమ్మకాయలు, విభూది, కాగితం ఆధారంగా పోలీసులు గ్రామంలో ఉన్న బురాన్ స్వాములను అక్కడికి పిలిపించి ఆరాతీశారు. మంత్రబొమ్మలు గీసిన వ్యక్తి ఎవరని పోలీసులు గట్టిగా అడగడంతో ఓ స్వామి తన దగ్గరికే వచ్చారని ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో 5 మంది వరకు బురాన్ స్వాములు ఉన్నారు. మూఢ నమ్మకంతో ఇక్కడి వచ్చి ఉంటారా? ఎవరైనా హత్యచేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

కనులపండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం


అయ్యవారిపల్లిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో మంగళవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దూపదీప నైవేద్యం కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 9.31 గంటలకు పుణ్యాహవచన, నవగ్రహ పూజ, సుదర్శన హోమం అనంతరం మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ భజనలతో శ్రీవారిని పల్లకిలో ఊరేగించారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సర్పంచ్ చెన్‌రెడ్డి ఊర్మిళ, ఆలయ కమిటీ చైర్మన్ చెన్‌రెడ్డి యాదిరెడ్డి, నాయకులు డాక్టర్ మోపతయ్య, కట్టా అనంతరెడ్డి, ఎంపీటీసీలు రంగారెడ్డి, మల్లేష్, పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగులో న్యూట్రి స్మార్ట్ గ్రామంగా అవంచ


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: రైతులు వరి, పత్తి, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటల సాగునే కాకుండా పోషకాలు అధికంగా అందించే చిరుధాన్యాలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని, అందు కోసం తిమ్మాజిపేట మండలం అవంచను న్యూట్రి స్మార్ట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యా సంస్థ విస్తరణ డైరెక్టర్ డా.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ న్యూట్రి స్మార్ట్ గ్రామం అనే కార్యక్రమాన్ని రూపొందించారని, అందులో భాగంగానే ఈ గ్రామానికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మంగళవారం అవంచలో పాలెం కేవీకే, వ్యవసాయ న్యూట్రి స్మార్ట్ గ్రామం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డా.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎక్కువ పోషకాలు ఉన్న చిరుధాన్యాలను, పెరటి కూరగాయలను సేంద్రియ పద్ధతిలో పండించి తిన్నడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. తక్కువ విస్తీర్ణంలో పొలం ఉన్న వారు కూడా చిరుధాన్యాల పంటలను సాగు చేసి ఆహార కొరతను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాలెం కేవీకే సమన్వయకర్త డా.జగన్‌మోహన్‌రెడ్డి, ఏఓ కమల్‌కుమార్, ఏఈఓ సాయిరాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలే ప్రధానం


రైతులకు శిక్షణ ఇస్తున్న అసోసియేట్ డీన్ పుష్పవతి

బిజినేపల్లి: ఆరోగ్యానికి చిరుధాన్యాలదే ప్రధాన పాత్ర అని పాలెం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పుష్పవతి అన్నారు. రైతులు ఎక్కువ విస్తీర్ణం వ్యవసాయ పొలాల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తే తక్కువ విస్తీర్ణం ఉన్న పొలాల్లో చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. మంగళవారం పాలెం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామం గంగారంలో చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డా.పుష్పవతి మాట్లాడుతూ రైతులు విత్తనోత్పత్తి స్వతహాగా ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కసారి తయారు చేసిన విత్తనం నుంచి మరో నాలుగు నుంచి ఐదు సార్లు వినియోగించుకోవచ్చన్నారు. పంటల్లో తెగుళ్లు, చీడపీడలు రాకుండా ముందగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళాశాల కన్వీనర్ డాక్టర్ శశిభూషణ్, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, సుమలత, చరణ్‌తేజ పాల్గొన్నారు.

వేరుశనగ పంట కోతకు 'డిగ్గర్' యంత్రం


ఉప్పునుంతలలో డిగ్గర్ యంత్రంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

- కూలీల కొరతను అధిగమించేందుకే..
- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

ఉప్పునుంతల: ప్రస్తుతం యాసంగిలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంట కోతదశలో ఉన్నందున ట్రాక్టర్‌తో నడిచే డిగ్గర్ యంత్రం సహాయంతో కూలీల కొరతను అధిగమించడంతోపాటు ఖర్చును తగ్గించుకోవచ్చని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మమత, విజయలక్ష్మి సూచించారు. పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పునుంతల మండల కేంద్రంలోని రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ కట్టా గోపాల్‌రెడ్డి వ్యవసాయ పొలంలో వేరుశనగ డిగ్గర్ యంత్రంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తాము రూపొందించిన వేరుశనగ డిగ్గర్ యంత్రంతో ప్రయోజనాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. వేరుశనగ పంటంతా ఒకేసారి రావడంతో కూలీల కొరతతోపాటు ఎకరాకు రూ.4వేల వరకు కేవలం పంటను భూమి నుంచి తీయడానికే ఖర్చవుతుందని తెలిపారు. పంటను తీసే సమయంలో కూలీలు దొరక్కపోవడంతో పంట మొలకెత్తడం తదితర నష్టం జరుగుతుందని తెలిపారు. డిగ్గర్ యంత్రంతో ఎక్కువ విస్తీర్ణంలో పంటను తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డెమో కోసం డిగ్గర్‌ను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఉచితంగా డిగ్గర్‌ను వినియోగించుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మంజుల, రైతులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగులకు రాజ్యాధికారం


అలంపూర్‌లో ఇస్త్రీ చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్ రూరల్: బీఎస్పీతోనే బడుగులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అలంపూర్‌తో పాటు మండలంలోని బైరంపల్లి, గొందిమల్ల, బుక్కాపూర్ గ్రామాల్లో మంగళవారం బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అలంపూర్ ప్రాంతం అన్ని రంగాల్లో వెనకబడిందని, ఓట్ల కోసం మాత్రమే ఇక్కడి ప్రజలు నాయకులు, పాలకులకు ఐదేళ్లకు ఒకసారి గుర్తుకొస్తారని మండిపడ్డారు. బీఎస్పీని ఆదరిస్తే బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు 50శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ..

ఉండవెల్లి: రాష్ట్రంలో రైతుల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని బొంకూరులో కుర్వ నరసింహ అనే వ్యక్తి గిట్టుబాటు ధర లేక అప్పులు ఎక్కువై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.

విద్యార్థులను అభినందించిన వాగ్దేవి యాజమాన్యం


విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి యాజమాన్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జేఈఈ మెయిన్స్ బీఆర్క్ ఫలితాలలో సత్తా చాటిన వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులను మంగళవారం యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్స్ బీఆర్క్‌లో తమ కళాశాల విద్యార్థులు 90 మందికి పైగా పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. రెండో సెషన్ పేపర్–2 లోనూ ఇదే విధంగా ప్రతిభ కనబరిచి అత్యుత్తమ పర్సంటైల్ సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమి ఇన్‌చార్జ్ పావని తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కృష్ణజింక మృతి


కృష్ణ జింకను పరిశీలిస్తున్న ఫారెస్టు సెక్షన్ అధికారి నీలేష్

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ సమీపంలో మంగళవారం కుక్కల దాడిలో కృష్ణజింక మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఫారెస్టు సెక్షన్ అధికారి నీలేష్ తెలపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో కృష్ణజింక చనిపోయి పడి ఉండటాన్ని గ్రామానికి చెందిన కొందరు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా.. కృష్ణజింకపై కుక్కలు దాడి చేసి చంపినట్లు తెలిసిందన్నారు. పంచనామా, పోస్టుమార్టం అనంతరం కృష్ణ జింకను కాల్చివేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా...



ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాటలో పోటీ పడుతున్న వ్యాపారులు

మిర్చికి రికార్డు ధర

ఖమ్మం మార్కెట్‌లో 'తేజా'రకం క్వింటాకు రూ.21,625

ఖమ్మం వ్యవసాయం: తేజా రకం మిర్చికి రికార్డు స్థాయిలో ధర పలికింది. ఈ రకం మిర్చి క్వింటాకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రూ.21,625గా ధర నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో ఈ ధరే అత్యధికమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది అన్ సీజన్‌లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి రూ.23 వేల వరకు ధర పలకగా, ప్రస్తుత సీజన్‌లో రైతు నేరుగా మార్కెట్‌లో పంట విక్రయిస్తున్న సమయంలో గరిష్ట ధర నమోదు కావడంతో హర్షం వ్యక్తమవుతోంది. తేజా రకం మిర్చి సాగు విస్తీర్ణం తెగుళ్ల బెడద కారణంగా గతేడాదితో పోలిస్తే తగ్గగా.. ఈసారి కూడా తెగుళ్ల కారణంగా దిగుబడులూ తగ్గాయి. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తేజా రకం మిర్చికి డిమాండ్ పెరగడంతో ధరకు రెక్కలొచ్చాయని విశ్లేషిస్తున్నారు. సోమవారం రూ.20,200 పలికిన ధర ఒకేరోజులో ఏకంగా రూ.1,425 పెరగడంతో రైతులు విక్రయానికి ముందుకొస్తున్నారు. కాగా, గరిష్ట ధర దక్కించుకున్న పలువురు రైతులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సత్కరించారు.

బీఆర్‌ఎస్ అండతోనే ఇసుక మాఫియా దాడి

సాక్షి, హైదరాబాద్: జనగాం జిల్లా యశ్వంతపూర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌పై అధికార పార్టీ నేతల అండతో ఇసుక మాఫియా దాడి చేయడాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఖండించారు. ఈ మొత్తం వ్యవహారంపై తగిన విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని, శ్రీనివాస్‌కు తగిన భద్రత కల్పించాలని ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలున్నారనే ఉద్దేశంతో కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే తగిన కార్యాచరణతో ప్రభుత్వంపై పోరాటానికి బీజేపీ సిద్ధమౌతుందని ఆయన హెచ్చరించారు.

గూడు కోసం గుడిసెలు



ఇవేవో జాతరలో వేసిన గుడారాలు అనుకుంటే పొరపాటే. ఆదిలాబాద్ జిల్లాలో తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీలు న్యూ హౌసింగ్‌బోర్డు సమీపంలోని సర్వే నంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసి ఆక్రమించారు. తమకు ఇంటి హక్కు కల్పించాలని.. లేకుంటే ప్రాణాలు పోయినా కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

'బిందు'కు..బంద్!

కూరగాయలు, పండ్ల తోటలకు సబ్సిడీ నిలిపివేత

- లక్షకు పైగా రైతుల దరఖాస్తులు పక్కన పెట్టిన వైనం
- ఒక్క ఆయిల్‌పాం సాగుకే సబ్సిడీపై డ్రిప్ పరికరాలు
- సర్కారు నిర్ణయంతో రైతుల్లో ఆందోళన
- తమకూ ఇవ్వాలంటూ వినతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)పై సందిగ్ధత నెలకొంది. కూరగాయలు, పండ్ల సాగులో డ్రిప్ పరికరాలకు ఇస్తున్న సబ్సిడీని ఉద్యానశాఖ నిలిపివేసింది. వివిధ పంటలకు చెందిన రైతులు డ్రిప్‌పై సబ్సిడీ కోరుతూ చేసుకున్న దరఖాస్తులను సైతం తిరస్కరించింది. ఇలా దాదాపు లక్షకు పైగా దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కాగా కేవలం ఆయిల్‌పాం సాగుకు మాత్రమే డ్రిప్ సబ్సిడీ నిధులను ఉద్యాన శాఖ బదిలీ చేసింది. దీంతో పండ్లు, కూరగాయల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రిప్‌ను సొంతగా ఏర్పాటు చేసుకోవడం అధిక వ్యయంతో కూడిన పని కావడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా తమకు డ్రిప్ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ... కానీ..

ఉద్యాన పంటలను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. తక్కువ నీటితో ఎక్కువ మొక్కలకు నీరు అందేందుకు అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తోంది. కానీ అకస్మాత్తుగా సబ్సిడీ నిలిపివేత నిర్ణయం తీసుకోవడంతో రైతులపై భారం పడనుంది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ (బిందు, తుంపర) సేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుంది. బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% వరకు సబ్సిడీ ఇస్తుంది. సాధారణంగా ఎకరానికి సూక్ష్మ సేద్యం ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇదే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.300 కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే తాజాగా ఆయిల్‌పాం తప్ప మిగతా పంటలను ప్రభుత్వం పక్కన పెట్టింది.

పూర్తిగా సొంత డబ్బులతో కొనుక్కోవాల్సిందే..

ఏటా దాదాపు లక్ష ఎకరాల వరకు ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ కోసం సబ్సిడీ ఇస్తున్నారు. తాజాగా కూరగాయలు, మామిడి, జామ వంటి పండ్ల తోటలకు డ్రిప్ సబ్సిడీ ఎత్తి వేయడంతో ఆయా రైతులు ప్రైవేట్‌లో ఎకరానికి సొంతంగా రూ.40 వేల వరకు ఖర్చు చేసి పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుండగా సర్కారు తాజా నిర్ణయంతో వారు కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల రైతులపై వందలాది కోట్ల రూపాయల భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పాం డ్రిప్ సబ్సిడీకి నిధులేవీ?

గతేడాది వరకు 55 వేల ఎకరాలకే పరిమితమైన ఆయిల్‌పాం విస్తీర్ణాన్ని రానున్న రోజుల్లో ఏకంగా 20 లక్షల ఎకరాలకు పైగా విస్తరించాలని రాష్ట్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్ పరిధిలోనే ఉన్న ఆయిల్‌పాంను కొత్తగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించింది. రాష్ట్రంలో 10 ప్రైవేట్ కంపెనీలకు వివిధ జిల్లాల్లో ఆయిల్‌పాం సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యత అప్పగించింది. ఆయిల్‌పాం సాగులో కీలకపాత్ర పోషించేది సూక్ష్మ సేద్యం పరికరాల ఏర్పాటే. కానీ ఆయిల్‌పాం సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ సొమ్ము కేటాయించలేదు. ఈ కారణంగానే ఇతర పంటలకు ఇస్తున్న సబ్సిడీకి కోతపెట్టి కేవలం ఆయిల్‌పాంకే నిధులు కేటాయించింది. ఇది ఇతర పంటల రైతులను కలవరపరుస్తోంది.

సూక్ష్మ సేద్యంలో తెలంగాణ వెనుకబాటు

మైక్రో ఇరిగేషన్‌లో తెలంగాణ వెనుకబడి ఉందని లెక్కలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా 2.30 కోట్ల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అందుబాటులోకి వచ్చింది. కానీ తెలంగాణలో ఇది కేవలం 12 లక్షల ఎకరాల్లోపే ఉందని అంచనా. దేశంలో అత్యధికంగా రాజస్తాన్‌లో 44.71 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత మహారాష్ట్రలో 35.31 లక్షల ఎకరాల్లో, గుజరాత్‌లో 28.45 లక్షల ఎకరాల్లో సాగవుతోంది.

43 శాతం నీరు ఆదా

డ్రిప్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేయడం వల్ల రాష్ట్రంలో 43 శాతం నీరు ఆదా అవుతుంది. ఇది 25 టీఎంసీల నీటికి సమానం. డ్రిప్ పథకాన్ని పంటల సాగుకు వాడడంతో 33 శాతం విద్యుత్ కూడా ఆదా అయినట్లేనని గతంలో న్యాబ్కాన్స్ సంస్థ చేసిన సర్వేలో తేలింది. అలాగే 52 శాతం దిగుబడి అదనంగా పెరిగినట్లు గుర్తించారు. ఎందుకంటే మొక్కకు అవసరమైన నీరు నేరుగా డ్రిప్ పైపుల ద్వారా వెళుతుంది. ఈ పరికరాల ద్వారా ఏడు సంవత్సరాల వరకు లబ్ధిపొందవచ్చు.

భద్రాద్రి రామయ్యకు 'సువర్ణ' వాహనాలు



భద్రాద్రి రామాలయానికి చేరుకున్న సువర్ణ హనుమత్ వాహనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ వారు సువర్ణ తాపడ వాహనాలను వితరణగా అందజేశారు. రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులోని కుంభకోణంలో ఈ వాహనాలను తయారు చేయించారు. సార్వభౌమ, హనుమంత, కల్పవృక్ష, సింహాసన, హంస, సింహ, గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష వాహనాలకు బంగారు పూతతో తయారు చేయించిన ఈ వాహనాలు మంగళవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నాయి. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి వీటికి స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. వీటికి గురు, శుక్ర వారాల్లో ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. శనివారం సాయంత్రం సార్వభౌమ వాహన సేవ నిర్వహించనున్నారు.

పగిలిన ఎల్లంపల్లి పైప్‌లైన్

పంప్‌హౌస్‌లోకి చేరిన నీరు



పగిలిన పైప్‌లైన్ నుంచి వస్తున్న నీరు, గేట్‌వాల్ నుంచి వస్తున్న లీకేజీ నీరు

ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం రిజర్వాయర్ సమీపంలోని ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద మంగళవారం సాయంత్రం బటర్‌ఫ్లయ్ వాల్వ్‌లోని పైప్ పగిలిపోయింది. ఆ నీరంతా సమీపంలోని పంప్‌హౌస్‌లోకి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఎత్తిపోతలను నిలిపివేశారు. జగిత్యాల జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు మంగళవారం ఉదయం 11 గంటలకు ఎల్లంపల్లి వద్ద ఒక మోటార్‌ను స్టార్ట్ చేశారు. ఒక మోటార్ 247 క్యూసెక్కులు ఎత్తిపోస్తుంది. ఇలా నాలుగు గంటలు సాఫీగా నడిచిన తర్వాత పంప్‌హౌస్ సమీపంలోని బటర్‌ఫ్లయ్ వాల్వ్ లోపలి పైప్ ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో నీరంతా పంప్‌హౌస్‌లోకి ప్రవహించింది. అధికారులు వెంటనే షట్టర్లను మూసివేసి మోటార్ పంప్‌లు మునిగిపోకుండా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ షట్టర్ సందుల్లోంచి.. కిటికీల ద్వారా నీరు లోపలికి చేరింది. నీటి ప్రవాహం పంప్‌హౌస్‌లోకి రాకుండా పగిలిన వాల్వ్ సమీపం నుంచి జేసీబీ సహాయంతో గండికొట్టి నీటిని తిరిగి రిజర్వాయర్‌లోకి మళ్లించారు. పగిలిపోయిన వాల్వ్ దగ్గర నుంచే జేసీబీతో పెద్ద కాలువలా తవ్వి నీటిని సమీపంలోని మేడారం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నీటిని రిజర్వాయర్‌లోకి తరలించేందుకు వేసిన కట్ట ప్రవాహానికి కొట్టుకుపోతే తిరిగి పంప్‌హౌస్‌లోకి నీరు చేరే అవకాశముంది. మోటార్లను నిలిపివేసినప్పటికీ నారాయణపూర్ నుంచి నీరు రివర్స్ వస్తుండటంతో పగిలిపోయిన పైప్ ద్వారా నీరు పైకి వస్తోంది. ప్రస్తుతం ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యం భోజనం

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి రోజు 35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తోందని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా శివారెడ్డిపల్లిలోని మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. తెలంగాణలో 28,632 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా 25 లక్షల మంది విద్యార్థులకు, అలాగే 4,237 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని 9.65 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఏడాదికి 1.50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ భాస్కరరావు, మేనేజర్ అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వట్టెం వెంకన్నకు అంకురార్పణ



బిజినేపల్లి: వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు మొదటిరోజు స్వామి వారికి అంకురార్పణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన పూజల్లో భాగంగా తెల్లవారుజాము నుంచి స్వామి వార్ల అలంకార, అర్చన వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్ర 6గంటల నుంచి సాయమారాధన, అర్చన, ఉత్సవానుజ్ఞ, వాసుదేవ పుణ్యాహవాచనం తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు, సందడి ప్రతాప్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పుష్కర బ్రహ్మోత్సవం అంకురార్పణ చేశారు. స్థానాచార్యులు శ్రీమద్వాదుల శ్రీమన్నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు వాస ఈశ్వరయ్య, బుచ్చయ్య, కృష్ణయ్య, బండారు రాజశేఖర్, రామచంద్రారెడ్డి, జక్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1,085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,021 అడుగుల మేర నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ. సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

108 సర్వీసులో ఉద్యోగ అవకాశాలు

నారాయణపేట రూరల్: ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ అత్యవసర సేవల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈఎంటీ పోస్టుకు సైన్స్ గ్రూపులో డిగ్రీ, బీఫ్మారసీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 30సంవత్సరాల వయస్సు కలిగి రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 3న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూకు రావాలని పేర్కొన్నారు.

ఐటీటవర్‌తో యువతకు ఉపాధి


- ఈనెలాఖరులోగా మంత్రి కేటీఆర్‌చే ప్రారంభం
- త్వరలోనే రూ.10 వేల కోట్లతో లిథియం గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఐటీ టవర్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రానికి చేరువలో దివిటిపల్లి వద్ద 400కు పైగా ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఐటీ, ఎనర్జీ పార్కులో తుది దశకు చేరుకున్న ఐటీ టవర్‌ను ఈ నెలాఖరులోగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణలోనే రెండో అతిపెద్ద ఐటీటవర్ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దివిటిపల్లి వద్ద తుది మెరుగులు దిద్దుకుంటున్న ఐటీ పార్కును జిల్లాకేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థులతో కలిసి మంత్రి మంగళవారం సందర్శించారు. ఐటీ పార్కు ఏర్పాటుతో స్థానిక యువతకు కలిగే ప్రయోజనాలను మంత్రి వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తీవ్ర అన్యాయానికి గురైన పాలమూరును సీఎం కేసీఆర్ సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 14 లక్షల మంది వలస వెళ్లే మన జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు, స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీ, ఎనర్జీ పార్కును ఏర్పాటు చేసినట్లు వివరించారు. 400 ఎకరాల్లో, లక్ష చదరపు అడుగుల్లో నిర్మిస్తున్న ఐటీ టవర్‌లో దేశ, విదేశాలకు చెందిన అనేక సాఫ్ట్‌వేర్ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్యాలు పెంపొందించి స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువలో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేస్తున్న ఐటీ, ఎనర్జీ పార్కులో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 10 వేల మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లిథియం గిగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలుష్య కారకమైన పెట్రోలు, డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయమైన ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన లిథియం బ్యాటరీలను అందించే దివిటిపల్లి పరిశ్రమ ప్రపంచంలోనే మూడోదన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ పరిశ్రమ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కానీ, ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు దుర్మార్గంగా ఈ పరిశ్రమపై దుష్ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం రూపురేఖలను మార్చే ఓ భారీ పరిశ్రమ వస్తుంటే సంతోషించాల్సింది పోయి పాడు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. దివిటిపల్లికి సమీపంలోనే ఉదండాపూర్, కర్వెన రిజర్వాయర్లు ఉన్నాయని, ఒకవేళ నిత్యం పరిశ్రమ వల్ల కాలుష్యం వస్తే ప్రభుత్వం ఎలా అనుమతి ఇస్తుందని ప్రశ్నించారు. అభివృద్ధి నిరోధకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు అయితే మొదట తామే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అమెరికాలో స్థిరపడిన స్థానికులతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. వారిని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తామన్నారు. త్వరలో జర్మనీలోని తెలంగాణ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి పెట్టుబడులు పెట్టేలా ఒప్పిస్తామన్నారు. రాబోయే 3, 4 ఏళ్లలో ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయన్నారు. ఒక్క మహబూబ్‌నగర్ పట్టణమే కాకుండా ఉమ్మడి జిల్లా అంతా బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంఏ రెహమాన్, మాజీ చైర్మన్ రాజేశ్వర్, జేపీఎన్‌సీఈ కళాశాల చైర్మన్ రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



రుణ, డిపాజిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఏపీజీవీబీ సిబ్బంది

- ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ జి.సుభాష్
- రుణ, డిపాజిట్లపై అవగాహన

స్టేషన్ మహబూబ్‌నగర్: ఖాతాదారులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ జి.సుభాష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం పట్టణంలోని ఏపీజీవీబీ శాఖల ఆధ్వర్యంలో రుణ, డిపాజిట్లపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంక్ హౌజింగ్ లోన్ 8.45శాతం తక్కువ వడ్డీ ఉందని, డిపాజిట్లపై 8 శాతం 777 రోజులకు, 7.60 శాతం 444 రోజులకు, 60 ఏళ్లు పైబడిన వారికి 777 రోజులకు 7.50శాతం, 444 రోజులకు 7.10 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. తమ బ్యాంక్‌లో సామాజిక భద్రత కింద రూ.436లతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన రూ.2 లక్షల ఇన్స్యూరెన్స్, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, 40 ఏళ్లలోపు వారు ప్రతి నెల క్రమం తప్పని పొదుపుతో 60 ఏళ్లు దాటిన తర్వాత రూ.1000 నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ పొందే సౌకర్యం ఉందని తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ సీనియర్ మేనేజర్ (బిజినెస్) మెర్సి అంబటి, సీనియర్ మేనేజర్ (ఆపరేషన్స్) టీఎస్.రంగారావు, మహబూబ్‌నగర్ శాఖ చీఫ్ మేనేజర్ కె.శ్రీనివాస్, రుణ ప్రాసెసింగ్ సెంటర్ సీనియర్ మేనేజర్ అజయ్‌కుమార్, పాతపాలమూర్ శాఖ మేనేజర్ యూ.రవికాంత్, భగీరథకాలనీ శాఖ మేనేజర్ జి.నితీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురంలోని రంగనాథ స్వామి బ్రహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రాతఃకాల సమయంలో అర్చకులు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్యం గ్రహణం, అంకురార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణునారాయణ, గోవిందాచార్యులు, సురేషాచార్యులు, కన్నయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



అథ్లెట్లు, డాక్టర్ ప్రేమ్‌కుమార్‌లను సన్మానించిన అథ్లెటిక్స్ సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్ పట్టణంలో గత నెల 25, 26 తేదీల్లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు ప్రతిభచాటి పతకాలు సాధించారు. క్రీడాకారులు రెండు బంగారు, మూడు రజత పతకాలు సాధించి సత్తాచాటారు. అండర్-18 బాలికల విభాగంలో సాయి సంగీత 200మీటర్ల పరుగులో బంగారు పతకం, 100మీటర్ల పరుగులో రజత పతకం, బాలుర విభాగంలో కె.శివకుమార్ 400మీటర్ల పరుగులో బంగారు పతకం, ఎం.నిఖిల్ ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, సాయికుమార్ 300మీటర్ల పరుగులో రజత పతకం సాధించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు ఇటీవలే ఆదిలాబాద్‌లో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో 60ఏళ్ల పైబడి విభాగంలో విజేతగా నిలిచిన డాక్టర్ ప్రేమ్‌కుమార్‌ను జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అథ్లెట్లకు ప్రోత్సాహకంగా రాజేంద్రకుమార్ రూ.2,500లు, డాక్టర్ ప్రేమ్‌కుమార్ రూ 1,000లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్, కార్య దర్శి శరత్‌చంద్ర, సంయుక్త కార్యదర్శులు సి.శ్రీనివాస్, సునీల్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటాలు




పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఇతర వక్తలు

పాలమూరు: సమాజంలో నెలకొన్న ఎన్నో రకాల సమస్యలపై అంపయ్య అలుపెరగని పోరాటాలు చేశారని, విద్యారంగం, సామాజిక రంగాల్లో మార్పు కోసం ఎంతో పని చేశారని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో మంగళవారం పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంపయ్య సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ఆయనపై రచించిన 'అలుపెరుగని ఉద్యమాల ఉపాధ్యాయుడు'తో పాటు 'అలసట ఎరగని ఉద్యమాల బాటసారి అంపయ్యతో నా అనుబంధం' అనే రెండు పుస్తకాలను ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడిగా అంపయ్య వివిధ ప్రజా సంఘాలతో కలిసి బాధ్యతగా పని చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం తొలి ప్రతి స్వీకరణ స్పందన చంద్రకళ, ఆప్తవాక్యంపై జి.యాదగిరి, రాజేంద్రబాబు ప్రసంగించారు. అనంతరం సి.రాంమోహన్ జీవితంపై రచించిన 'మానవత పతక' అనే పుస్తకాన్ని సైతం ఆవిష్కరించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, సోమయ్య, ఇక్బాల్ పాష, నారాయణ, వెంకట్రాములు, నిజాముద్దీన్, కె.సి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు



అటవీ ప్రాంతంలో మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది



శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం తరచుగా అగ్నికి ఆహుతి అవుతుండగా తాజాగా మంగళవారం అనేక ప్రాంతాల్లోని అడవులు అగ్నికి ఆహుతి అయిన సంఘటన చోటుచేసుకుంది. మన్ననూర్ రేంజ్ పరిధిలో ఫరహాబాద్ సౌత్, తుర్కపల్లి సెక్షన్, దోమలపెంట రేంజ్‌లో అక్కమదేవి, తాటిగుండాలు, అమ్రాబాద్ రేంజ్‌లో బోరెడ్డిబావి శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి తదితర 15చోట్ల అడవికి నిప్పు అంటుకుంది. సంఘటనలో 70 మంది అటవీ సిబ్బందితో పాటు అమ్రాబాద్ ఫైర్ సిబ్బంది పాల్గొని మంటలను అదుపులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 9గంటల నుంచి సాయింత్రం 4గంటల వరకు మంటలను అదుపు చేయగలిగారు. వేసవి కావడంతో అడవి మొత్తం ఎక్కడ చూసినా ఎండుఆకులు, గడ్డితో నిండుకుని ఉండటంతో వందల ఎకరాల్లో అడవి కాలిపోయినట్లు తెలిసింది.